# చేతులు కాలక ముందే ఆకులు పట్టలేమా..!

(05 జూన్ 'ప్రపంచ పర్యావరణ దినం' సందర్భంగా)

భూగోళంపై విస్తరించబడిన పర్యావరణ వ్యవస్థ సకల జీవకోటికి రక్షక కవచంగా ఉంటూ ఆరోగ్య ప్రదాతగా నిలబడి ప్రకృతి సహజత్వాన్ని కాపాడుతూనే ఉంటున్నది. సహజ ప్రకృతికి అంతరాయం కలిగిస్తే, జీవ వైవిధ్యానికి విఘాతం ఏర్పడి కరోనా మహమ్మారి లాంటి భూతాలు పుట్టుకొస్తాయి. విచ్ఛిన్నతకు లోనైన పర్యావరణాన్ని నేటి నుంచి 2050 వరకు పునరుద్ధరించడానికి 8.1 ట్రిలియన్ డాలర్లు అవసరమని, ఏడాదికి కనీసం 536 బిలియన్ డాలర్లు కేటాయించాల్సి ఉంటుందని ఐరాస అంచనా వేసింది. పర్యావరణ ప్రకోపాన్ని, జీవవైవిధ్య విచ్ఛిన్న దుష్ఫలితాలను నేటి విశ్వమానవాళి ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారి విపత్తుల రూపంలో అనుభవిస్తున్నది. పర్యావరణంలోని శిలావరణం, జీవావరణం, జలావరణం, వాతావరణాలను మనిషి దుర్వినియోగం చేయడం, విచక్షణారహితంగా విధ్వంసం చేయడంతో గాలి, నేల, నీరు కలుషితమై సకల ప్రాణకోటి మనుగడను ప్రమాదంలోకి నెడుతున్నది.

ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారమే మన నినాదం:

పర్యావరణ పరిరక్షణను యజ్ఞంగా చేపట్టి, గత ప్రకృతి సహజ వైభవాన్ని పునరుద్ధరించాలనే సందేశాన్ని ప్రపంచ దేశాలకు ఇవ్వడానికి ఒక మంచి వేదికగా 1974 నుంచి ప్రతి ఏటా 05 జూన్ రోజున 'ప్రపంచ పర్యావరణ దినం' పాటించాలని ఐరాస తీర్మాణించింది. నేల నాణ్యత క్షీణతతో ఆహార ఉత్పత్తులు ప్రభావితం కావడం, ఆహార కొరత ఏర్పడడం, పేదరికం పెరగడం జరుగుతున్నాయి. అడవుల నరికివేతతో మనిషికి, వన్య ప్రాణులకు మధ్య సంఘర్షణ జరిగి, జీవ వైవిధ్యం విచ్ఛిన్నం అవుతూ పులులు, ఏనుగులు, ఎలుగుబంటులు, చిరుతలు లాంటి వన్యప్రాణులు కూడా జనావాస ప్రాంతాలకు చేరి ప్రాణ భయాన్ని కలిగిస్తున్నాయి. ప్రపంచ పర్యావరణ దినం-2023 నినాదంగా 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం (సొల్యూషన్స్ టు ప్లాస్టిక్ పొల్యూషన్)' అనబడే అంశాన్ని తీసుకొని 'సుస్థిర జీవనానికి భూగోళంతో సహజంగా, సామరస్యంగా మేలుకుందాం' అనబడే అంశాన్ని కేంద్రంగా చేసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పర్యావరణ విచ్ఛిన్నానికి, పేదరికానికి, అనారోగ్యానికి మధ్య అనులోమ సంబంధం ఉంటుందని గమనించాలి.

## పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం:

ఐరాస పర్యావరణ కార్యక్రమంలో భాగంగా పర్యావరణానికి జరిగిన విధ్వంసాన్ని గమనించి, తగు కఠిన చర్యలు తీసుకునే ఉద్దేశంతో రాబోయే 10-సంవత్సరాలను 'పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం (ఎకోసిస్టమ్ రీస్టొరేషన్)'గా తీసుకొని పర్యావరణ పూర్వ వైభవాన్ని, స్వచ్ఛతను, ఆరోగ్యాన్ని, పరిశుద్ధతను తిరిగి స్థాపించేలా చర్యలు చేపట్టుటకు నిర్ణయించడం ముదావహం. కరోనా మహమ్మారి విజృంభనతో ప్రపంచ మానవాళి నిస్సహాయ స్థితిలో భయకంపితం కావడం జరిగింది. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని, ప్రకృతి సహజ స్థితిని విచ్ఛిన్నం చేసిన మానవుడు తగు భారీ మూల్యాలను చెల్లించవలసి వస్తున్నది. జీవావరణంతో తలపడితే మనిషి బతుకు నరకప్రాయం అవుతుందని అవగతమైంది. ఈ ప్రమాదకర దుస్థితిని గమనించిన ఐరాస 'రీక్రియేట్ (పునర్ సృష్టి), రీఇమేజింగ్ (తిరిగి పరిస్థితి అంచనా), రీస్టోర్ (పునరుద్ధరించడం)' అనే నినాదంతో 2021-2030 కాల వ్యవధిని 'పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం'గా పాటించుటకు నిర్ణయించారు.

## పృథ్వీ పునాదులను పునర్నిర్మాణం చేయలేమా..!

కోల్పోయిన పృథ్వీ పునాదులను తిరిగి ప్రతిష్టించుకోవాడానికి సత్వరమే ప్రపంచ దేశాలన్నీ కంకనబద్దులు కావాలసిందే. వాతావరణానికి, జీవ వైవిధ్యతకు, నేల క్షీణతకు విడదీయరాని సంబంధం ఉంటుంది. జీవ వైవిధ్య విచ్ఛిన్నంతో ప్రతి ఏటా 10 శాతం ఆర్థిక నష్టం జరుగుతోంది. సత్వరమే మేల్కొని పునరుద్ధరణకు పూనుకోని యెడల విద్య, వైద్య, ఉద్యోగ రంగాలు తిరోగమన దిశగా కదలడం ఖాయమని రుజువైంది. ప్రపంచం సుస్థిరాభివృద్ధి దిశలో పయనించడానికి పర్యావరణ పరిరక్షణ అత్యవసరం. అడవులను పోషించడం, నరికివేతను నిషేధించడం, వన్యప్రాణుల రక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడటం, గ్రామీణ పట్టణ ప్రాంతాలలో హరిత వనాలను పెంచడం, గాలి కాలుష్యాన్ని నిరోధించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని కట్టడి చేయడం లాంటి పలు చర్యలను తీసుకుంటూ పర్యావరణ పునరుద్దరణకు పూనుకోవాలి.

## ప్రకృతి హెచ్చరికలు గుణపాఠం కావాలి:

అకాలవర్ష వడగళ్ళు, తుఫానులు, సునామీలు, ప్రకృతి ప్రళయాలు, భూతాపం, మహానగరాల్లో గాలి కాలుష్యం, అంటువ్యాధుల వ్యాప్తి లాంటి ప్రకృతి హెచ్చరికలను మానవుడు అలక్ష్యం చేస్తే, ఎవరు తీసిన గోతిలో వారే పడక తప్పదని నవ్య నరుడు కళ్ళు తెరవాల్సిన సమయం ఆసన్నమైంది. త్రాగడానికి పరిశుభ్రమైన నీరు, పీల్చడానికి స్వచ్ఛమైన గాలి, నడవడానికి ఆరోగ్యకరమైన మట్టి లేనప్పుడు మనిషి సాధించిన అభివృద్ధి అంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. భూ ఉపరితలంపై ఉన్న నీటిలో 2 శాతం మాత్రమే త్రాగడానికి యోగ్యతను కలిగి ఉందని, సహజ నీటి వనరులను కాపాడుకోవలసిన అవసరాన్ని సమాజం గుర్తించాలి. ఆరోగ్యకర పర్యావరణ వ్యవస్థతో మాత్రమే జీవనోపాధులు పెరుగుతూ, సానుకూల వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య పరిరక్షణలు జరుగుతాయని గుణపాఠం చేర్చుకోవాలి.

## పీపుల్స్ డే:

'పీపుల్స్ డే'గా పిలువబడే ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అవసరం, పునరుద్ధరణ అవశ్యకత, నేల-నీరు-గాలి కాలుష్య అదుపు జరిగితేనే ప్రాణికోటి (వృక్ష జంతుజాలం) ఆరోగ్యంగా మనగలుగుతుందనే సందేశాన్ని ఇవ్వడం జరుగుతుంది. పర్యావ'రణం'తో తలపడితే మనిషి మనుగడ కరువవుతుంది. తక్షణమే తన తప్పును తెలుసుకొని పర్యావరణ విధ్వంసానికి చరమగీతం పాడుతూ, కోల్పోయిన ప్రకృతి సహజత్వానికి జీవం పోయని యెడల రాబోయే రోజుల్లో మానవాళి సహజ జీవనయానం ప్రమాదంలో పడనుందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. చేతులు కాలక ముందే ఆకులు పట్టుకొని, పరిస్థితులు విషమించక పూర్వమే పరిణతిని ప్రదర్శించి పర్యావరణానికి పట్టాభిషేకం చేద్దాం, సకల జీవకోటికి జీవం పోద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# హైదరాబాద్‌లో నిర్వహిస్తోన్న 3వ హెల్త్ వర్కింగ్ గ్రూప్ సైడ్ ఈవెంట్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్న ఆయుష్ మంత్రిత్వ శాఖ

హైదరాబాద్, జూన్ 5: తెలంగాణలోని హైదరాబాద్‌లో ఈ ఏడాది జూన్ 4 నుండి జూన్ 6 వరకు నిర్వహిస్తున్న 3వ హెల్త్ వర్కింగ్ గ్రూప్ సైడ్ ఈవెంట్ ఎగ్జిబిషన్‌లో ఆయుష్ మంత్రిత్వ శాఖ పాల్గొంటోంది. ఆయుష్ మంత్రిత్వ శాఖతో పాటు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పరిశోధన మండలిచే అభివృద్ధి చేయబడిన ఆయుష్-64, ఆయుష్-82,యూఎన్ఐఎం004 + యూఎన్ఐఎం 005, కబాసుర కుడినీర్ మరియు హోమియోపతిక్ ఫార్ములేషన్ నానోకుర్కుమిన్ వంటి పరిశోధన ఆధారిత ఆయుష్ ఔషధాలు/ఫార్ములేషన్‌ను ప్రదర్శిస్తోంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాస్యూటికల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఎంపిసిఎల్) వారు తయారు చేసిన ఆయుష్ ఫార్ములేషన్‌ను కూడా ప్రదర్శిస్తోంది.

ఈ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ రూపొందించిన "జీ20 ప్రైమర్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్" మరియు ఫోరమ్ ఆన్ ఇండియన్ ట్రెడిషనల్ మెడిసిన్ (ఎఫ్ఐటిఎం)ని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పి.సింగ్ బాఘెల్, కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.పి. ప్రసాద్, సిసిఆర్ఏఎస్ ఆర్ఓ డాక్టర్ సంతోష్ మానే మరియు హైదరాబాద్ ఎన్ఐఐఎంహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాంప్రదాయ వైద్యంపై జీ-20 ప్రైమర్ బుక్‌లెట్ ఆయుష్ వ్యవస్థలు మరియు ప్రపంచ ఆరోగ్య సంరక్షణలో దాని పాత్రపై సమగ్ర అవలోకనాన్ని అందిస్తుంది. దాంతో పాటు ఈ ప్రైమర్ ఆయుష్ వ్యవస్థ సూత్రాలు, అభ్యాసాలు మరియు ప్రయోజనాలు, ప్రధాన స్రవంతి ఆరోగ్య సంరక్షణలో దాని ఏకీకరణను ప్రోత్సహించడం, దాని ప్రయోజనాలు మరియు సవాళ్లను అన్వేషించడం మరియు జీ-20-సభ్య దేశాల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

జీ-20 సభ్య దేశాలకు చర్చలలో పాల్గొనడానికి, అనుభవాలను పంచుకోవడానికి మరియు ఆయుష్‌ను వారి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల్లోకి చేర్చడానికి వ్యూహాలను అభివృద్ధి చేయడానికి ఇది పునాదిగా ఉపయోగపడుతుంది. ఏకీకరణ, సహకారం, పరిశోధన మరియు నియంత్రణను ప్రోత్సహించడం ద్వారా జీ-20 దేశాలు ఆరోగ్య సంరక్షణ ఫలితాలను మెరుగుపరచడానికి, అందుబాటులో ఉండే మరియు సరసమైన ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందించడానికి మరియు ప్రపంచ శ్రేయస్సుకు దోహదం చేయడానికి ఆయుష్ వ్యవస్థ యొక్క సామర్థ్యాన్ని ఉపయోగించుకోవచ్చు.

జీ20 ఇండియా ప్రెసిడెన్సీలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 3వ హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశం హెల్త్ ట్రాక్‌కు సంబంధించిన యొక్క మూడు కీలక ప్రాధాన్యతలపై దృష్టి సారించింది. 3వ హెచ్‌డబ్ల్యుజి సైడ్ ఈవెంట్స్ ఎగ్జిబిషన్ ఆరోగ్య రంగంలో పరిశోధన మరియు ఆవిష్కరణలను హైలైట్ చేస్తోంది.

# మణిపూర్‌లో చెలరేగిన హింసాత్మక ఘటనలపై విచారణ జరిపేందుకు కమిషన్ ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, జూన్5:మణిపూర్‌లో చెలరేగిన హింసాత్మక ఘటనలపై విచారణ జరిపేందుకు, కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952 కింద, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం త్రిసభ్య కమిషన్‌ను నియమించింది. గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అజయ్ లాంబా కమిషన్‌కు అధ్యక్షత వహిస్తారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీ హిమాన్షు శేఖర్ దాస్, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ అలోక ప్రభాకర్ సభ్యులుగా ఉంటారు.

మణిపూర్‌లో హింస చెలరేగడం, వ్యాప్తి చెందడానికి గల కారణాలు, ఇందుకు అధికారులు లేదా వ్యక్తుల వల్ల ఏవైనా తప్పులు జరిగాయా అనే కోణంలో కమిషన్ విచారణ చేస్తుంది.

మే 29 మే నుంచి జూన్ 1వ తేదీ వరకు మణిపూర్‌లో పర్యటించిన కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా, అక్కడి పరిస్థిని పరిశీలించారు. ఆ తర్వాత విచారణ కమిషన్ నియామకం జరిగింది.కమిషన్ తన నివేదికను వీలైనంత త్వరగా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి. కమిషన్ ప్రధాన కార్యాలయం ఇంఫాల్‌లో ఉంటుంది.

# ముంబై విమానాశ్రయంలో సుమారు రూ. 6.2 కోట్ల విలువైన 10 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న డిఆర్ఐ, 2 అరెస్టు



న్యూఢిల్లీ, జూన్5:రెండు వేర్వేరు కేసుల్లో 3 & 4 జూన్ 2023న డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) ముంబై 10కిలోలకు పైగా బంగారాన్ని స్వాధీనం చేసుకుంది.

మొదటి కేసులో, నిర్దిష్ట నిఘా సమాచార ఆధారంగా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లైట్ నెం.ఎఐ 252లో షార్జా నుంచి ముంబై వచ్చిన 2 ప్రయాణీకులను అడ్డుకున్నారు. ఆ ఇద్దరు ప్రయాణీకులను తనిఖీ చేస్తున్నప్పుడు విదేశీ గుర్తులు ఉన్న 8కిలోల 24 కారట్ల బంగారాన్ని 8 బంగారు కడ్డీల రూపంలో తమ నడుముకు చుట్టి దాచుకున్న విషయాన్ని కనుగొన్నారు. తదుపరి నిఘా సమాచారంపై తక్షణమే స్పందించి, ఈ ప్రయాణీకుల సహచరుడిని అదుపులోకి తీసుకున్నారు. పరీక్షలలో స్వాధీనం చేసుకున్న కడ్డీ రూపంలోని 8కేజీల బంగారం విలువ రూ. 4.94 కోట్లు. మొదటి కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు.

రెండవ కేసులో, దుబాయ్ నుంచి వస్తున్న ఒక భారతీయుడిని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ (సిఎస్ఎంఐ) విమానాశ్రయంలో 3 జూన్ 2023న అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రయాణీకుడి బ్యాగేజ్‌ను పరీక్షిస్తుండగా, మహిళలు వాడే క్లచ్ పర్సులను గుర్తించారు. ఈ మొత్తం పర్సులకీ 24 క్యారెట్ల బంగారాన్ని వెండి రంగు మెటల్ వైర్ల రూపంలో తెలివిగా పర్సుల లోహపు బద్దల కిందదాచి పెట్టడాన్ని కనుగొన్నారు.

ఈ కనుగొన్న బంగారు వైర్లు నికర బరువు 2004 గ్రాములు, తాత్కాలిక విలువ రూ. 1,23,80,875. ఈ కేసులో ఆ ప్రయాణీకుడిని అరెస్టు చేయడం జరిగింది. రెండవ కేసులో బాగా చదువుకున్న వ్యక్తులు బంగారం స్మగ్లింగ్‌కు ప్రణాళికలు వేసి, అమలు చేయడంలో ప్రత్యక్షంగా ప్రమేయాన్ని కలిగి ఉన్నారని తెలుస్తోంది.

రెండు కేసులలో కార్యనిర్వహణ పద్ధతి వినూత్నంగా ఉండటంగా కనుగొన్నారు. ఇది దేశంలోకి వివిధ రూపాల్లో బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్న సిండికేట్‌లను తనిఖీ చేయడానికి డిఆర్ఐ అధికారులు నిత్యం ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లను సూచిస్తుంది.

ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో వెండి రంగు లోహపు వైర్ల రూపంలో విదేశీ ముద్ర బంగారం, దానితో పాటుగా కడ్డీల రూపంలో 24 క్యారెట్ల బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం అన్నది బంగారం స్మగ్లింగ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి గుర్తుగా చెప్పుకోవచ్చు

దాదాపు రూ. 6.2 కోట్ల విలువైన దాదాపు 10కిలోల బంగారాన్ని మొత్తం 4 ప్రయాణీకుల నుంచి స్వాధీనం చేసుకుని, ఈ కేసులలో వారిని అరెస్టు చేయడం జరిగింది. తదుపరి దర్యాప్తు, విచారణలు కొనసాగుతున్నాయి.

# వికారాబాద్‌లో గ్రీన్ ర్యాలీ.. పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్



హైదరాబాద్, జూన్ 5: పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వికారాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ మంజుల అన్నారు. సోమవారంప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణంపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ గ్రీన్ ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.

పర్యావరణం బాగుంటేనే మనందరం బాగుంటామని, పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా నడుచుకోవాలని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా వికారాబాద్ పట్టణంలోని సినిమాక్స్ థియేటర్ దగ్గర నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు గ్రీన్ ర్యాలీ నిర్వహించింది.

# ఒడిషాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలు/ స్నేహితులు/ బంధువులు, చిక్కుకుపోయిన ప్రయాణీకుల సౌకర్యార్థం 139 హెల్ప్‌లైన్ నెంబర్ ఏర్పాట్లు

న్యూఢిల్లీ, జూన్5:ఒడిషాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలు/ స్నేహితులు/ బంధువులు, చిక్కుకుపోయిన ప్రయాణీకుల సౌకర్యార్థం 139 హెల్ప్‌లైన్ నెంబర్ ద్వారా భారతీయ రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సీనియర్ అధికారుల బృందం ఒకటి 24చ7 హెల్ప్‌లైన్ ను నిర్వహిస్తోంది. జోనల్ రైల్వేలు, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని కాలర్లకు సంబంధిత వివరాలను అందిస్తోంది. ఈ సేవలునిరంతరాయంగా నడవడమే కాక, రైల్వే మంత్రి ప్రకటించిన మెరుగైన నష్టపరిహారం - మృతి చెందినవారి కుటుంబానికి రూ. 10లక్షలు, తీవ్ర గాయాలైన వారికి రూ. 2 లక్షలు, స్వల్ప గాయాలు అయిన వారికి రూ. 50,000 సత్వర పంపిణీని నిర్ధారిస్తోంది. . ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రయాణీకులకు, వారి బంధువులకు సరైన, సంతృప్తికరమైన సమాచారాన్ని ఇవ్వడంలో తోడ్పడడం రైల్వే హెల్ప్ లైన్ 139 లక్ష్యం. ఇప్పటివరకూ రైల్వేలు 285 కేసుల్లో ( 11 మరణాల కేసులు, 50 తీవ్రంగా గాయపడినవారి కేసులు, 222 సాధారణ గాయాల కేసులు) రూ. 3.22 కోట్ల నష్టపరిహారాన్ని అందించింది. నష్టపరిహారాన్ని 7 ప్రదేశాలలో (సోరో, ఖరగ్‌పూర్, బాలాసోర్, ఖంతాపార, భద్రక్, కటక్, భుబనేశ్వర్)లలో భారతీయ రైల్వేలు చెల్లిస్తోంది.

# సికింద్రాబాద్‌లో జరిగిన కౌశల్ మహోత్సవంలో ఎంపిక అయిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన కేంద్ర మంత్రి శ్రీ.జి.కిషన్ రెడ్డి



హైదరాబాద్, జూన్5:సికింద్రాబాద్‌లో జరిగిన కౌశల్ మహోత్సవంలో ఎంపిక అయిన అభ్యర్థులకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక,ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ.జి.కిషన్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. సికింద్రాబాద్‌లో ఈరోజు జరిగిన కౌశల్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ కిషన్ రెడ్డి ఎంపిక అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ కిషన్ రెడ్డి నైపుణ్యంతో విధులను సమర్ధంగా నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. వివిధ రంగాలలో పెరుగుతున్న అవకాశాలను భర్తీ చేయడానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం అవుతాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వివిధ రంగాలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. యువత ఆశలు సఫలం అయ్యేలా చూడాలన్న లక్ష్యంతో ప్రముఖ సంస్థల సహకారంతో కౌశల్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. దేశంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రాధాన్యత ఇస్తున్నారని శ్రీ కిషన్ రెడ్డి తెలిపారు. అవసరమైన శిక్షణ ఇచ్చి వివిధ రంగాలలో ఉపాధి పొందేలా కౌశల్ మహోత్సవ్ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తున్నదని శ్రీ కిషన్ రెడ్డి వివరించారు. యువతకు ఉద్యోగాలు లభించేలా చూసేందుకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రి శాఖ భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగ మేళాలు నిర్వహిస్తుందన్నారు.

నియామక పత్రాలు పొందిన వారిని అభినందించిన కేంద్ర మంత్రి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎన్ఎస్ డిఐ, ఎన్ఐపియూఎన్ఏ, ఎన్ఎస్టిఐ సిబ్బందిని, వాలంటీర్లను మంత్రి అభినందించారు.

ఎన్ఎస్‌డిసి జనరల్ మేనేజర్ పంగ్ఖురి బోర్గోహైన్ మాట్లాడుతూ సరైన ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు, కౌన్సెలింగ్ నిర్వహించి అధ్యార్ధులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకునేందుకు ఉద్యోగ మేళా నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల వివరాలు అందించి వాటి ద్వారా ప్రయోజనం పొందేలా చూసేందుకు, పీఎంకేవై, ఐటీ కోర్సులుతదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ మేళా నిర్వహణకు సహకరించిన శ్రీ జి. కిషన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ మేళాకు దాదాపు 5000 మంది హాజరయ్యారు. వారిలో దాదాపు 1500 ఉద్యోగాలు పొందారు. 150 కి పైగా సంస్థలు కార్యక్రమంలో పాల్గొన్నాయి. అభ్యర్థులకు కౌన్సెలింగ్, ప్రీ-స్క్రీనింగ్, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్టిఐ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ కే శ్రీనివాసరావు, ఎన్ఎస్టిఐ చైర్మన్ ఎఓఅ శ్రీ సూర్య రాజ్ కూడా పాల్గొన్నారు.

# 2కె వాక్‌లో పాల్గొని.. మొక్కలు నాటిన ఎంపీ సంతోష్ కుమార్



హైదరాబాద్, జూన్5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేట ఇన్స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ క్యాంపస్ లో 2కే వాక్, గ్రీన్ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా మొక్కలు నాటిన అనంతరం 2కే వాక్ ను ఎంపీ సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీసీ కమిషన్ మెంబర్ కిషోర్ గౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ రవీందర్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ డైరెక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గర్భిణీలు, బాలింతలకు ఇక ఇంటికే రేషన్.. వచ్చే నెల నుండి లబ్ధిదారులకు ముడి సరుకులు




అమరావతి, జూన్5:రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాల ద్వారా లబ్దిదారులకు బలమైన పౌష్టికాలను సరఫరా చేస్తోంది. కాగా గత కొంతకాలంగా ఈ పౌష్టికాహార పంపిణీని ప్రభుత్వం నిలిపివేసి గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తోంది. అయితే, అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేసేందుకు లబ్ధిదారుల నుండి సరైన స్పందన రాలేదు. గర్భిణీలు, బాలింతలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి అధికార యంత్రాంగం ద్వారా తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంపై లబ్దిదారుల అభిప్రాయ సేకరణ చేపట్టింది.

టేక్ హోం రేషన్ ద్వారా నేరుగా ముడి సరుకులను అందించాలా.. లేక కేంద్రాల్లో భోజనానికి వస్తారా అన్న అంశంపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 80 శాతానికిపైగా లబ్దిదారులు స్టేక్ హోం రేషన్ విధానానికే మొగ్గు చూపారు. దీంతో గతంలో కోవిడ్ సమయంలో నేరుగా పౌష్టికాలను లబ్దిదారులకు ఏ విధంగా పంపిణీ చేశారో ఇప్పుడు అదే విధంగా పంపిణీ చేయాలన్న నిర్ణయాన్ని తీసుకుంది. దీనికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చినప్పటికీ ఇప్పటివరకూ ఈ విధానం అమలు కాలేదు. వాస్తవంగా ఈనెల 1వ తేదీ నుండే టేక్ హోం రేషన్ కార్యక్రమం ప్రారంభం కావల్సి ఉన్నా టెండర్ల ప్రక్రియ ఇతర అంశాలు ఒక కొలిక్కి రాకపోవడంతో ఇదికాస్తా వాయిదా పడింది.

జులై 1 నుండి టేక్ హోం రేషన్‌ను ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రతి నెలా రెండు విడతలుగా పౌష్టికాలను పంపిణీ చేయాలని ఉత్తర్వుల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ స్పష్టంచేసింది. ప్రతి నెలా 1 నుండి 5 తేదీల్లోగా మొదటి విడతగా బియ్యం, కందిపప్పు, కోడిగుడ్లు, నూనె, పాలు, రాగి పిండి, అటుకులు, బెల్లం చిక్కీలు, ఎండు ఖర్జూరం గర్భిణీలు, బాలింతలకు అందించాలని ఉద్దేశించింది. అదేవిధంగా రెండో విడతగా 16, 17 తేదీల్లో పాలు, కోడిగుడ్లు అందించాలని స్పష్టం చేసింది. గతంలో జొన్న పిండిని లబ్దిదారులకు పంపిణీ చేసేవారు. అయితే ఇప్పుడు దానికి బదులుగా రాగి పిండిని అందించనున్నారు.

ఇదిలా ఉంటే చిన్నారులకు యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వంటకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఆసామగ్రి కొనుగోలు రూ. 23.62 కోట్లను విడుదల చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నిధులతో స్టవ్‌లు, కుక్కర్లు, వంట పాత్రలు కొనుగోలు చేయాలని శిశు సంక్షేమ శాఖ పేర్కొంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అంగన్‌వాడీ ఆయాలు, సిబ్బంది ఎదుర్కొంటున్న వంట సమస్యకు పరిష్కారం లభించనుంది.

# శ్రీ తుల్జా భవాని శక్తిపీట్ ఆలయంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రత్యేక పూజలు

హైదరాబాద్, జూన్5: మహారాష్ట్ర రాష్ట్రం, తుల్జాపూర్ లోని శ్రీ తుల్జా భవాని శక్తిపీట్ ఆలయంలో అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్, ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా-స్వప్న దంపతులు సకుటుంబ సమేతంగా.. దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. శ్రీ తుల్జా భవాని శక్తిపీట్ ఆలయంను తమ కుటుంబంతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందడం జరిగిందన్నారు. తమ కుటుంబాన్ని చల్లగా చూడాలని, అమ్మవారి కృప, దీవెనలు ప్రజలు అందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో బంగారు తెలంగాణ కోసం బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వంద సంవత్సరాలు జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు.

అలాగే దేశ ప్రజలు, రాష్ట్ర ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులు అంతా పాడి పంటలతో విలసిల్లాలని, ప్రజలందరూ ఆనందంగా వుండాలని కోరుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ బాగుండాలని, మన తెలంగాణలో మూడవ సారి కూడా అధికారం చేపట్టి, 95 నుండి 100 సీట్లతో భారీ మెజారిటీతో గెలిచి, హ్యాట్రిక్ సాధించాలన్నారు. తెలంగాణలో అన్ని వర్గాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం సమాన హక్కులు కల్పిస్తుందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుబంధు, దళితబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, బీసీలు, ఎస్సీలు, ఎస్టీల కోసం ఓబీసీ ల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు సమాన న్యాయం చేస్తున్నారన్నారు.

# సముద్ర వాణిజ్య సామర్థ్యాన్ని పెంపొందించడానికి బీబీఐఎన్ఎం దేశాల మధ్య మరింత సహకారం కోసం కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ పిలుపు

న్యూఢిల్లీ, జూన్5:ఈరోజు కోల్‌కతాలో జరిగిన బంగాళాఖాతం ప్రాంతంలో సముద్ర అభివృద్ధిలో లబ్దిదారుల కీలక సమావేశానికి ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖ సహాయ మంత్రి శ్రీ శంతను ఠాకూర్‌తో పాటు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాలు మరియు ఆయుష్ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ హాజరయ్యారు. భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ మరియు నేపాల్ రాయబారులతో పాటు పరిశ్రమ మరియు వాణిజ్య ప్రతినిధులతో సంభాషించిన తరువాత మంత్రి ఈ ప్రాంతంలోని సముద్ర రంగంలో విలువను వృద్ధి చేయడం కోసం వాటాదారులందరి మధ్య మరింత సహకారం కోసం పిలుపునిచ్చారు. భారతదేశం యొక్క తూర్పు ప్రాంతం అలాగే భారతదేశం యొక్క పొరుగు దేశాలైన భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ మరియు నేపాల్ అభివృద్ధికి యాక్ట్ ఈస్ట్ పాలసీ గరిష్ట సామర్థ్యాన్ని చేరుకోవడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని శ్రీ సోనోవాల్ నొక్కిచెప్పారు. సెయిల్, టాటా స్టీల్, ఐ ఓ సి, హల్దియా పెట్రోకెమికల్స్ లిమిటెడ్, బీ పీ సీ ఎల్, జిందాల్ స్టీల్, మేసెర్క్ షిప్పింగ్ లైన్స్ మరియు కార్పొరేట్ ప్రపంచంలోని అనేక ఇతర సీనియర్ నాయకులు కూడా ఈ సమావేశానికి హాజర య్యారు.



ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, "ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీ యొక్క చురుకైన నాయకత్వంలో, ప్రభుత్వం యొక్క యాక్ట్ ఈస్ట్ పాలసీ అపూర్వమైన ఊపందుకుంది, ఈ ప్రాంతంలో అభివృద్ధి లో నూతన యుగానికి నాంది పలికింది. ప్రధాన మంత్రి గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ రవాణా నమూనాను హేతుబద్ధీకరించడానికి మరియు ఆకర్షణీయమైన వ్యాపార ప్రతిపా దనను రూపొందించడానికి మరొక ప్రోత్సాహం. సముద్ర రంగం అలాగే అంతర్గత జలమార్గాల రంగం ఈ దూరదృష్టితో కూడిన రవాణా పథకంలో మార్పుకు ప్రధాన చోదకాలు. దీనికి సుస్థిరమైన మరియు సమర్థవంతమైన ఆర్థికం గా చౌకైన కార్గో రవాణా ను మార్చే అవకాశం ఉంది. ఈ చిరస్మరణీయ ప్రయాణంలో, ప్రతి ఒక్కరికీ గరిష్ట విలువ సృష్టిని అందించడానికి మీ క్రియాశీల మద్దతు మరియు వేగవంతమైన సహకారాన్ని మేము కోరుకుంటున్నాము.

బంగ్లాదేశ్/ ఈశాన్య ప్రాంతం/ మయన్మార్ ద్వారా ఈశాన్య కార్గో రవాణాను నిర్ధారించడం కోసం జాతీయ జలమార్గాలు 1 మరియు 2 ద్వారా వాణిజ్యం, ఎస్ ఎం పీ మధ్య వస్తువుల రవాణాను సులభతరం చేయడం ద్వారా బంగ్లాదేశ్‌తో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం, కోల్‌కతా మరియు బంగ్లాదేశ్‌లోని వివిధ నౌకాశ్రయాలు (చిట్టగాంగ్, మోంగ్లా) ఐ డబ్ల్యు ఏ ఐ ని కలిగి ఉన్నాయి; కే ఎం ఎం టీ టీ పీ లో భాగంగా, మిజోరాం మీదుగా ఈశాన్య ప్రాంతంకు కార్గోను రవాణా చేయడానికి మయన్మార్‌లోని మయన్మార్ యొక్క సిట్వే పోర్ట్‌తో సహకారం; ఎస్ టీ ఎస్ /ట్రాన్స్‌షిప్‌మెంట్ కార్యకలాపాల కోసం డ్రాఫ్ట్ పరిమితులను అధిగమించడానికి ఎస్ ఎం పీ ఎక్ పరిమితుల్లో డీప్ డ్రాఫ్టెడ్ ఫెసిలిటీలను ఉపయోగించడం; పీ పీ పీ మోడ్ ద్వారా ఎస్ ఎం పీ కే వద్ద సామర్థ్య మెరుగుదలలు వంటివి సమావేశంలో చర్చించబడిన కొన్ని ముఖ్య అంశాలు.

శ్రీ సర్బానంద సోనోవాల్ ఇంకా మాట్లాడుతూ, "యాక్ట్ ఈస్ట్ విధానం భారతదేశం యొక్క తూర్పు భాగానికి మాత్రమే కాకుండా, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ మరియు మయన్మార్‌ల వాణిజ్య మరియు వ్యాపార ప్రయోజనాల కోసం వృద్ధికి నాంది పలికింది. వారణాసి నుండి బంగ్లాదేశ్ మీదుగా దిబ్రూఘర్ వరకు ప్రయాణించిన గంగా విలాస్ పర్యాటక విజయం, దక్షిణాసియా ప్రాంతంలో జల పర్యాటక రంగం యొక్క గొప్ప సంభావ్యతను పెంచింది, ఇది మన గొప్ప సంస్కృతి మరియు వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. అదేవిధంగా, మేము ఈశాన్య భారతదేశంతో పాటు భూటాన్ మరియు బంగ్లాదేశ్‌లకు కొత్త మార్గాన్ని తెరిచే మయన్మార్‌లోని వ్యూహాత్మక సిట్వే పోర్ట్‌లో విజయవంతంగా ఆపరేషన్‌ను ప్రారంభించాము. మేము ఈ ప్రాంతంలో సముద్ర రంగం అభివృద్ధి పట్ల మా నిబద్ధతను ధృవీకరిస్తున్నాము మరియు ఈ ప్రాంతంలో అభివృద్ధికి మా అంతర్గత నదీతీర వ్యవస్థను ఉపయోగించి రవాణా పరిష్కారాలను శక్తివంతం చేయడం ద్వారా విలువను మెరుగు పరుస్తాము. ఇది ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారి 'సబ్కా సాత్, సబ్కా వికాస్' దార్శనికతకు నిజమైన ప్రతిబింబం.

ఐ బీ పీ/కే ఎం ఎం టీ టీ పీ మార్గం ద్వారా గంగా నది మరియు బ్రహ్మపుత్ర నది ద్వారా అంతర్గత జల రవాణాను పెంచడం గురించి ఐ డబ్ల్యు ఏ ఐ /అనుబంధ భాగస్వాములతో చర్చతో సమావేశం ప్రారంభమైంది. దీని తర్వాత భారతదేశ పొరుగు దేశాల (నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్) కాన్సుల్ జనరల్‌లతో మంత్రుల ఇంటరాక్టివ్ సమావేశం జరిగింది. బహుముఖ కార్యక్రమాల సహాయంతో నిరంతర సహకారం మరియు ఎంటర్‌ప్రైజ్ ద్వారా 2013-14 నుండి ఎస్ ఎం పీ కే మరియు ఈ ప్రాంతం మొత్తంగా వాణిజ్యం వృద్ధి చెందడంలో కీలక పాత్ర పోషించినందుకు కేంద్ర మంత్రి వాటాదారులను ప్రశంసించారు.

# వ్యాక్సిన్ అభివృద్ధి కోసం పరిశోధన, అభివృద్ధి అంశాలపై ప్రపంచ స్థాయి సహకారంపై జీ-20 ఆధ్వర్యంలో జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, జూన్5:"కోవిడ్ -19 మహమ్మారి వల్ల వ్యాక్సిన్ పరిశోధన , అభివృద్ధి లో ప్రపంచ స్థాయి సహకారం ప్రాముఖ్యత వెల్లడయింది. శతాబ్దానికి ఒకసారి సంభవించే కోవిడ్ లాంటి ప్రజారోగ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి జరిగిన ప్రయత్నాలతో అభివృద్ధి చెందుతున్న వ్యాధికారక కారకాల కోసం వ్యాక్సిన్ అభివృద్ధి వేగవంతం చేయడానికి పరిశోధన ప్రాముఖ్యతను భారతదేశం గుర్తించింది'' .. డాక్టర్ మాండవీయ విస్తరిస్తున్న వ్యాధికారక కారకాల నివారణ కోసం వ్యాక్సిన్ అభివృద్ధి చేయడానికి అంతర్జాతీయ సహకారం అవసరం.. డాక్టర్ మాండవీయ ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, ఫార్మా సంస్థలు, సంబంధిత వర్గాల మధ్య సమన్వయం సాధించడానికి జీ-20 ఒక ముఖ్య వేదికగా పనిచేస్తుంది... డాక్టర్ మాండవీయ '' సమర్ధంగా పనిచేసే వ్యాక్సిన్ అభివృద్ధి, వినియోగం వల్ల ఆరోగ్య అత్యవసర పరిస్థితి తలెత్తకుండా నివారించవచ్చు. లక్ష్య సాధన కోసం పరిశోధన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చి అమలు చేయాలి." .. డాక్టర్ మాండవీయ

వ్యాక్సిన్ పరిశోధన, అభివృద్ధి అంశాల్లో దేశాల మధ్య సహకారం, సమన్వయం ప్రాధాన్యతను కోవిడ్-19 మహమ్మారి గుర్తు చేసింది. శతాబ్దానికి ఒకసారి సంభవించే కోవిడ్ లాంటి ప్రజారోగ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి జరిగిన ప్రయత్నాలతో భవిష్యత్తులో ఎదురయ్యే వ్యాధి కారకాల నిరోధానికి వ్యాక్సిన్ అభివృద్ధి చేయాల్సిన ప్రాధాన్యతను భారతదేశం గుర్తించింది" అని కేంద్ర ఆరోగ్య, రసాయనాలు,ఎరువుల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. " వ్యాక్సిన్ పరిశోధన, అభివృద్ధి: భవిషత్తులో సంభవించే అవకాశం ఉన్న వ్యాధి కారకాల నివారణ, సంసిద్ధత, ప్రతిస్పందన" అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ స్థాయి చర్చా కార్యక్రమంలో డాక్టర్ మాండవీయ వర్చువల్ విధానంలో ప్రసంగించారు. హైదరాబాద్ లో ఈ రోజు జరిగిన జీ-20 హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో భాగంగా కేంద్ర ఫార్మస్యూ టికల్స్ శాఖ సమావేశాన్ని నిర్వహించింది.

భవిష్యత్తులో తలెత్తే ప్రమాదం ఉన్న వ్యాధి వ్యాప్తి కారకాల నిరోధానికి అవసరమైన వ్యాక్సిన్ పై పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు అంతర్జాతీయ సదస్సు ఒక వేదికగా పనిచేస్తుందన్న ఆశాభావాన్ని డాక్టర్ మాండవీయ వ్యక్తం చేశారు. " వ్యాక్సిన్ అభివృద్ధి ఒక కీలకమైన అంశం.భవిష్యత్తులో ఆరోగ్య సంక్షోభ పరిస్థితి తలెత్తకుండా చూడడానికి వ్యాక్సిన్ అభివృద్ధి చేసే అంశంలో ప్రపంచ స్థాయిలో సంఘటిత ప్రయత్నాలు జరగాల్సిన అవసరం ఉంది'' అని డాక్టర్ మాండవీయ పేర్కొన్నారు. '' భవిష్యత్తులో తలెత్తే అవకాశం ఉన్న ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం వ్యాక్సిన్ అభివృద్ధి చేయడానికి ప్రపంచ దేశాల మధ్య సహకారం అవసరం. దీనికోసం ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, ఫార్మా సంస్థలు, సంబంధిత వర్గాల మధ్య సమన్వయం సాధించడానికి జీ-20 ఒక ముఖ్య వేదికగా పనిచేస్తుంది" అని డాక్టర్ మాండవీయ అన్నారు.

వ్యాక్సిన్ పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి అంశాలలో గత కొద్ది శతాబ్దాలుగా ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా ఉందని డాక్టర్ మాండవీయ అన్నారు. పోలియో, మశూచి, మీజిల్స్ వంటి వ్యాధులకు వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేయడం మరియు పంపిణీలో అనేక దశాబ్దాలుగా భారతదేశం ముందు ఉందని డాక్టర్ మాండవీయ అన్నారు వ్యాక్సిన్ అభివృద్ధి అంశంలో భారతదేశం విజయాలు ప్రపంచ సహకారాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. "ప్రభావవంతమైన వ్యాక్సిన్‌ల అభివృద్ధి, పంపిణీ వల్ల ఆరోగ్య సంక్షోభం ప్రభావాన్ని తగ్గించడానికి అవకాశం కలుగుతుంది.ఈ లక్ష్యాన్ని సాధించడానికి పరిశోధన అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి" అని ఆయన అన్నారు.

వ్యాక్సిన్ ఉత్పత్తి ,సరఫరాను ఎక్కువ చేయడానికి భారతదేశం చేస్తున్న ప్రయతనాలు వివరించిన డాక్టర్ మాండవీయ " ఉత్పత్తి సామర్ధ్యాన్ని పెంచడానికి వ్యాక్సిన్ తయారీదారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలు, క్రమబద్ధీకరించిన నియంత్రణ ప్రక్రియలను అందించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో అందుబాటులో ఉన్న ప్రస్తుత మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో టీకాల లభ్యత పెరిగేలా చూడడానికి కూడా ఇది చర్యలు అమలు చేస్తున్నాం" అని ఆయన వివరించారు.

ఆరోగ్య సంరక్షణ రంగానికి భారతదేశం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాదని డాక్టర్ మాండవీయ స్పష్టం చేశారు. దీనిలో భాగంగా ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపిన మంత్రి అందరికీ వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చి సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేస్తున్నదని అన్నారు. వ్యాక్సిన్ అభివృద్ధి, పరిశోధన రంగాలలో భారతదేశం సాధించిన ప్రగతిని ప్రపంచ దేశాలు ఉపయోగించుకుని భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.కోవిడ్ -19 వ్యాక్సిన్ ఉత్పత్తి , పంపిణీలో భారతదేశం కీలకంగా వ్యవహరించి ప్రపంచ ఆరోగ్య భద్రత పట్ల తనకున్న చిత్తశుద్ధి చాటింది అని మంత్రి అన్నారు. "వ్యాక్సిన్ రంగంలో సమానత్వం అవసరమని భారతదేశం గుర్తించింది. ఆదాయం, జాతీయత లాంటి అంశాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ప్రాణాలను రక్షించే వ్యాక్సిన్ అందుబాటులోకి రావాలి అన్నది భారతదేశం అభిమతం " అని ఆయన వివరించారు.

మహమ్మారి నివారణ, సంసిద్ధత, ప్రతిస్పందన కోసం పటిష్ట ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రపంచ దేశాల మధ్య సహకారం అవసరం అని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్ పేర్కొన్నారు. భారతదేశం సాంప్రదాయకంగా ప్రపంచ అగ్రగామిగా ఉంది అని తెలిపిన శ్రీ రాజేష్ భూషణ్ జెనరిక్స్ బయోసిమిలర్‌లలో భారతదేశం ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉందన్నారు. ప్రధాన భారతీయ వ్యాక్సిన్ తయారీదారులు ప్రపంచ వ్యాక్సిన్ సరఫరాలో 50% కంటే ఎక్కువ సరఫరా చేస్తున్నాం న్నారు. వ్యాక్సిన్ తయారీ కాలక్రమాన్ని దశాబ్దాల నుండి ఒక సంవత్సరం కంటే తక్కువ లో ఉండాలని కోవిడ్-19 వల్ల తెలిసిందన్నారు. "మహమ్మారి సమయంలో నేర్చుకున్న గుణపాఠాలను ఒక వ్యవస్థగా వ్యవస్థాగతీకరించడం అవసరం, ఇది దేశాలు దాటి, ఖండాలలో విస్తరించి ఉంటుంది . అందరికీ సమానమైన రీతిలో వ్యాక్సిన్ అందుబాటులో ఉండాలని కోవిడ్ వల్ల తెలిసింది " అని ఆయన చెప్పారు.ఫార్మాస్యూటికల్స్ విభాగం కార్యదర్శి శ్రీమతి ఎస్ అపర్ణ మాట్లాడుతూ వ్యాక్సిన్ అభివృద్ధికి ప్రపంచ స్థాయిలో సహకారం అవసరం అని స్పష్టం చేశారు. అన్ని దేశాలకు వ్యాక్సిన్ సకాలంలో అందడం లేదన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ కొన్ని దేశాలకు 18 నెలల తర్వాత అందడం దీనికి నిదర్శనం అని అన్నారు. అన్ని దేశాలకు సకాలంలో వ్యాక్సిన్ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం లక్ష్యంగా ప్రపంచ సదస్సు జరుగుతుందన్నారు. దీనివల్ల విలువైన వనరులు పూర్తిగా సమర్ధంగా వినియోగం అవడానికి కల్తీ నిరోధానికి అవకాశం కలుగుతుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ హైదరాబాదులో ప్రతి సంవత్సరం 9 మిలియన్ వ్యాక్సిన్ డోస్‌లు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. ఇది ప్రతి సంవత్సరం ఉత్పత్తి అవుతున్న మొత్తం వ్యాక్సిన్‌లలో మూడింట ఒక వంతుకు సమానమని అన్నారు. భారతదేశ మొట్టమొదటి స్వదేశీ కోవిడ్-19 వ్యాక్సిన్, కోవాక్సిన్ పూర్తిగా హైదరాబాద్‌లో పరిశోధించబడి ఉత్పత్తి అయ్యిందన్నారు. స్పుత్నిక్ వంటి ఇతర ప్రపంచ ప్రఖ్యాత వ్యాక్సిన్ లకు సంబంధించిన పరిశోధన, అభివృద్ధిలో కొంత భాగం హైదరాబాద్‌లో జరిగాయని ఆయన పేర్కొన్నారు. దేశీయ సంస్థలతో సహకరించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించిన శ్రీ జయేష్ రంజన్ నగరంలో పరిశోధన అభివృద్ధి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రపంచ వ్యాక్సిన్ తయారీదారులను ఆహ్వానించారు.

ప్రతిపాదిత గ్లోబల్ వ్యాక్సిన్ పరిశోధన కోసం జీ-20 సభ్య దేశాలు, ప్రత్యేక ఆహ్వానిత దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించ డానికి ఫార్మాస్యూటికల్స్ విభాగం ప్రోగ్రామ్ ఫర్ అప్రోప్రియేట్ టెక్నాలజీ ఇన్ హెల్త్ (ఖయిఉ), కోయలిషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్‌నెస్ ఇన్నోవేషన్స్ (అిఖఎ)తో కలిసి పని చేస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఎదుర్కో వడానికి వ్యాక్సిన్ అభివృద్ధి కోసం పరిశోధనలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి కృషి జరుగుతుంది.

రేపటి నుంచి ప్రారంభం కానున్న 3వ జీ-20 హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలకు కార్యకమం నంది పలికింది. . ఈరోజు చర్చకు వచ్చిన సిఫార్సులు,విధానాలను మరింత లోతుగా చర్చిస్తారు. ఆరోగ్య కార్యవర్గ సమావేశాలలో వీటిపై చర్చలు జరుపుతారు. ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి డాక్టర్ రాజీవ్ బహ్ల్,ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ సైంటిస్ట్, జెరెమి ఏ ఫర్రార్, ప్రపంచ ఆరోగ్య సంస్థ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్, పాత్ సంస్థ సీఈఓ నికోలాయ్ గిల్బర్ట్, సెపి సీఈఓ డాక్టర్ రిచర్డ్ హాట్చెట్, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయక్త కార్యదర్శి శ్రీ ఎన్ యువరాజ్, జీ-20 సభ్య దేశాలు, ప్రత్యేక ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూఎస్ ఎయిడ్ లాంటి సంస్థ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైల్వే ట్రాక్‌పై మృతదేహాలు.. మెదక్ జిల్లాలో ఘటన

మెదక్, జూన్5: (నేటినిజం ప్రతినిధి):మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి, బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఇద్దరు చనిపోయారు. మృతుల్లో ఒకరు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యాదగిరిగా గుర్తించారు. అయితే, మరొకరు ఎవరు అనేది తెలియాల్సి ఉంది. యాదగిరి మృతదేహం రైలు పట్టాల పక్కన పడి ఉండగా.. మరొక వ్యక్తి మృతదేహం రైలు పట్టాలపై నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడి చేతిపై అమ్మ అని రాసి ఉండగా.. చెవికి చెవి పోగు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, వేరు వేరు ప్రమాదాలు జరిగి ఇద్దరు చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# మే వరకు ఏబిపిఎస్ ద్వారా దాదాపు 88% వేతన చెల్లింపు

న్యూఢిల్లీ, జూన్5:అనేక సందర్భాల్లో లబ్ధిదారుడు బ్యాంకు ఖాతా నంబర్‌లో తరచుగా మార్పులు చేయడం, సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసర్ కొత్త ఖాతా నంబర్‌ను అప్‌డేట్ చేయకపోవడం కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. లబ్దిదారుడు సకాలంలో కొత్త ఖాతా, వేతన చెల్లింపు అనేక లావాదేవీలు గమ్యస్థాన బ్యాంకు శాఖ ద్వారా తిరస్కరణకు గురువవుతున్నాయి. (పాత ఖాతా సంఖ్య కారణంగా).

వివిధ వాటాదారులతో సంప్రదించి, అటువంటి తిరస్కరణలను నివారించడానికి డీబీటీ ద్వారా వేతన చెల్లింపు చేయడానికి ఏబిపిఎస్ ఉత్తమ మార్గం. లబ్ధిదారు లకు సకాలంలో వేతనాలు అందజేయ డంలో ఇది దోహదపడుతుంది.

పథకం డేటాబేస్‌లో ఆధార్‌ను అప్‌డేట్ చేసిన తర్వాత, లొకేషన్‌లో మార్పు లేదా బ్యాంక్ ఖాతా నంబర్‌లో మార్పు కారణంగా లబ్దిదారు ఖాతా నంబర్‌లను అప్‌డేట్ చేయాల్సిన అవసరం లేదు. ఆధార్ నంబర్‌తో అనుసంధానం అయిన ఖాతా నంబర్‌కు డబ్బు బదిలీ జరుగుతుంది. లబ్దిదారుడు ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు ఉంటే, ఎంజిఎన్ఆర్ఈజీఏ విషయంలో ఇది అరుదైన విషయం అయినప్పటికీ, ఆ లబ్దిదారుడు ఒక ఖాతాను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఎన్పిసిఐ డేటా ప్రకారం ఆధార్ డీబీటీ తో అనుసంధానం అయితే అక్కడ 99.55% లేదా అంతకంటే ఎక్కువ సత్ఫలితాలు ఉంటాయి. ఖాతా ఆధారిత చెల్లింపు విషయంలో అటువంటి ఫలితాలు దాదాపు 98% ఉంటుంది.

మహాత్మా గాంధీ ఎన్ఆర్ఈజిఎస్ కింద, ఏబిపిఎస్ 2017 నుండి వాడుకలో ఉంది. ప్రతి వయోజన జనాభాకు దాదాపుగా సార్వత్రిక ఆధార్ సంఖ్య అందుబాటులోకి వచ్చిన తర్వాత, ఇప్పుడు ఈ పథకం కింద లబ్దిదారులకు ఏబిపిఎస్ ని విస్తరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఏబిపిఎస్ తో అనుసంధానం అయిన ఖాతాకు మాత్రమే ఏబిపిఎస్ ద్వారా చెల్లింపు అవుతుంది, అంటే ఇది చెల్లింపు బదిలీకి సురక్షితమైన, వేగవంతమైన మార్గం.

మొత్తం 14.28 కోట్ల మంది క్రియాశీల లబ్దిదారుల్లో 13.75 కోట్ల మందికి ఆధార్ సీడ్ చేశారు. ఈ సీడెడ్ ఆధార్‌కు గాను, మొత్తం 12.17 కోట్ల ఆధార్‌లు ప్రామాణీకరించారు. 77.81% మంది ఇప్పటికే ఏబిపిఎస్ కి అర్హులు. మే 2023 నెలలో, దాదాపు 88% వేతన చెల్లింపు ఏబిపిఎస్ ద్వారా చేయడం జరిగింది.

యుఐడిఐఏ ప్రకారం, 98% కంటే ఎక్కువ మంది వయోజన జనాభా ఆధార్ సంఖ్యను కలిగి ఉంది. ఒక వ్యక్తికి ఆధార్ నంబర్ అవసరమైతే, ఆమె లేదా అతను తగిన ఏజెన్సీ లేదా సమీపంలోని ఆధార్ కేంద్రాన్ని సందర్శించడం ద్వారా పొందవచ్చు.

100% ఏబిపిఎస్ సాధించడానికి రాష్ట్రాలు క్యాంపులను నిర్వహించాలని, లబ్దిదారులను సమన్వయించేలా కోరడం జరిగింది. పని కోసం వచ్చే లబ్దిదారుని ఆధార్ నంబర్‌ను అందించమని అభ్యర్థించాలని, అయితే దీని ఆధారంగా పనిని తిరస్కరించవద్దని మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలకు స్పష్టం చేసింది.

ఒక లబ్దిదారుడు పని కోసం డిమాండ్ చేయకపోతే, అటువంటి సందర్భంలో ఏబిపిఎస్అర్హత గురించి ఆమె/అతని స్థితి పని డిమాండ్‌పై ప్రభావం చూపదు.

కార్మికుడు ఏబిపిఎస్ కి అర్హులు కాదనే కారణంతో జాబ్ కార్డ్‌లను తొలగించడం సాధ్యం కాదు. మహాత్మా గాంధీ ఎన్ఆర్ఈజీఏ డిమాండ్ ఆధారిత పథకం. వివిధ ఆర్థిక కారకాలచే ప్రభావితమవుతుంది. ఏబిపిఎస్ కోసం సరైన పర్యావరణ వ్యవస్థ స్థానంలో ఉంది. లబ్దిదారులకు ఏబిపిఎస్ ప్రయోజనాలను పరిశీలిస్తే, చెల్లింపు కోసం అనుసరించాల్సిన ఉత్తమమైన వ్యవస్థ ఇది. ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ అనేది లబ్దిదారుల ఖాతాలో చెల్లింపు జమ అయ్యే మార్గం తప్ప మరొకటి కాదు. ఈ వ్యవస్థలో బాగా నిర్వచించబడిన దశలు ఉన్నాయి. లబ్దిదారులు, క్షేత్ర స్థాయి అధికారులు అన్ని ఇతర వాటాదారుల పాత్ర స్పష్టంగా నిర్వచించబడింది. ఏబిపిఎస్ నిజమైన లబ్దిదారులకు వారి బకాయి చెల్లింపును పొందడానికి సహాయం చేస్తుంది. నకిలీ లబ్దిదారులను తొలగించడం ద్వారా అవినీతిని అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మహాత్మా గాంధీ ఎన్ఆర్ఈజీఏ ఆధార్-ఆధారిత చెల్లింపును స్వీకరించలేదు.

# నీటి లభ్యత, వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి.. స్పీకర్ తమ్మినేని



శ్రీకాకుళం, జూన్5:నీటి లభ్యత వినియోగంపై ప్రతిఒక్కరూ సంపూర్ణమైన అవగాహనను కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. ఆమదాలవలస మండలం కత్యాచార్యుల పేట పంచాయతీ పరిధిలోని ఈసర్ల పేట గ్రామంలో సుమారు 8.60 లక్షల నిధులతో, మండాది గ్రామంలో సుమారు 23.30 లక్షల వ్యయంతో, జొన్నవలస పంచాయతీ పరిధిలోని ఈసర్ల పేట గ్రామంలో 23.50 లక్షల వ్యయంతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి పథకాన్ని సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా త్రాగునీరు అందుబాటులోకి తీసుకవచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తోందని ఆయన తెలిపారు.

సగటు పౌరుడు కు అవసరమయ్యే త్రాగు నీటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా విస్తృత పరిశోధనలు జరగడం శుభ పరిణామమన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించా లని లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహ న్రెడ్డి పనిచేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఒక్కరికి అందించడమే తమ ప్రభుత్వం అంతిమ లక్ష్యమన్నారు. కలుషితమైన నీరు తాగే క్రమంలో పలు వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయన్నారు. స్వచ్ఛమైన గాలి ఎంత ముఖ్యమో, స్వచ్ఛమైన నీరు అంత అవసరమ న్నారు.

నియోజక వర్గంలో ప్రతి గడపగడపకు జల జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన త్రాగు నీరందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నేల, గాలి, నీరు అనేవి జీవజాతి మనుగడకు అత్యంత ఆవశ్యకమైనవన్నారు. భూతలంలో ఉన్న నీటి వనరులు వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉంటాయన్నారు.

భూమి అంతర్భాగంలో ఉన్న నీటి వనరులను ప్రాధాన్య క్రమంలో రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 90శాతం మేర మానవ వినియోగానికి ఉపకరించని నీటిని.. ప్రజలకు ఉపయుక్తకరంగా మార్పు చేయుట ద్వారా శాస్త్ర వేత్తలు పరిశోదనలు కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచ దేశాలలో చాలా చోట్ల మంచినీటి లభ్యత చాలా తక్కువ గా ఉందని, మన దేశంలో కూడా కొన్ని ప్రదేశాలలో మంచినీటి సమస్య వలన కొన్ని జీవజాతులు అంతరించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న జనాభాకి సరిపడా నీటి వనరులు సృష్టించే దిశగా సాగుతున్న అధ్యయనాలు, సత్ఫలితాలు రానున్నాయని అన్నారు. నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే భవిష్యత్ తరాలు మనుగడ ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. మానవునికి ప్రతీ అవసరంలోనూ నీటి వినియోగం అత్యంత ఆవశ్యకమని, ఈ విషయం లో ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. భూగర్భ జలాల సద్వినియోగంపై గ్రామీణ ప్రజానీకా నికి అవగాహన కల్పించేలా చొరవ చూపాలని సూచించారు.ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నేతృత్వంలో పెద్దఎత్తున చేపట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బెనీడి గోవిందరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు గోంటి కృష్ణ, గురుగుబెల్లి ప్రభాకరెడ్డి నర్సింగరావు, గండ్రెడ్డి రమణ, గండ్రెడ్డి శ్రీరాములు, అంబటి లక్ష్మణ రావు వైయస్సార్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలకు ఎంపిలుగా ఛాన్స్-జగన్ సరికొత్త వ్యూహం..

అమరావతి, జూన్5:మార్పుల్లో భాగంగా కొందరు ఎంపీలను అసెంబ్లి బరిలోకి దింపాలని, మరికొంత మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అలా చేయడంవల్ల జిల్లాల పరిధిలో చాలా వరకూ అభ్యర్థులపై అసంతృప్తి తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఆ దిశగానే అభ్యర్థుల ఎంపికను చేపడుతున్నట్లు చెబుతున్నారు. వారం రోజులుగా అవకాశం దొరికినప్పుడల్లా ఇదే అంశంపై ముఖ్య నేతలతో సీఎం జగన్ సమాలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది. కష్ట కాలంలో తన వెనుక నడిచిన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించడంతోపాటు వివిధ కారణాల తో ప్రజలకు దూరంగా ఉంటున్న వారికి కూడా తిరిగి అవకాశం కల్పించే దిశగానే ఆయన ఆలోచన చేస్తున్నారు. అందుకోసం కొన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేలను ఎంపీలుగా బరిలోకి దించాలని చూస్తున్నారు. తద్వారా పార్లమెంటు పరిధిలో సమీకరణలు మారి వెనుకబడిన ఎమ్మెల్యేను కూడా గెలిచే అవకాశాలు ఉంటాయని ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది. మరికొన్ని జిల్లాల్లో అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారి వారసులను రంగంలోకి దించాలని ఆదిశగా కూడా సిట్టింగులకు పరోక్షంగా సహకారాన్ని అందించాలని ఆయన చూస్తున్నట్లు చెబుతున్నారు.

**పలువురికి ఎంపీలుగా అవకాశం**

2019 ఎన్నికల్లో పలువురు ఎంపీలకు ఎమ్మెల్యేలుగా సీఎం జగన్ అవకాశం కల్పించారు. వారంతా 2014 ఎన్నికల్లో వైసీపీ నుండి గెలుపొందిన వారే. అయితే వివిధ కారణాలతో వారిపై కొంత వ్యతిరేకత రావడంతో సీఎం జగన్ వారిని వదులుకోవడం ఇష్టం లేక ప్రత్యామ్నాయంగా పార్లమెంటు పరిధిలోని అసెంబ్లిట నియోజకవర్గాల్లో పోటీచేసే అవకాశం కల్పించారు. ఈ ప్రయోగం మంచి ఫలితాలను ఇచ్చింది. దీంతో 2024 ఎన్నికల్లో కూడా అదే తరహాలో ఎమ్మెల్యేలకు ఎంపీలుగా, ఎంపీలకు ఎమ్మెల్యేలుగా సర్దుబాటు చేస్తే అనుకూల వాతావరణం ఉంటుందని యోచిస్తున్నారు. అందులో భాగంగానే శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పార్టీ సీనియర్ నేత రాజ్యసభ సభ్యుడు జిల్లా పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డిని వచ్చే ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంటు నుండి బరిలోకి దించే యోచనలో సీఎం జగన్ ఉన్నారు. ఇప్పటికే ఆదిశగా వీపీఆర్‌కు ఇదే విషయాన్ని చెప్పారు. దీంతో ఆయన పార్లమెంటు పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ బలమైన అభ్యర్థులను బరిలోకి దించే యోచన చేస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం నెల్లూరు సిట్టింగ్ ఎంపీ ఆదాల ప్రభాకర రెడ్డికి వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం జగన్ రంగంలోకి దించబోతున్నారు. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఇదే తరహా మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో చర్చించి సర్దుబాటు దిశగా నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు తెలుస్తుంది.

**త్వరలో కొలిక్కి**

వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనుంది. కేంద్రం ముందస్తు ఎన్నికలకు వెళ్తే తెలంగాణ తోపాటు నవంబరు, డిసెంబరులోనే ఏపీలో కూడా ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకులు ప్రధాన పార్టీల నేతల్లోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీంతో ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఇప్పటికే జిల్లాల వారీగా అభ్యర్థుల జాబితాపై కసరత్తు చేస్తున్నాయి. 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న సీఎం జగన్ ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్లు చెబుతున్నారు. జూన్ నెలాఖరులోపు దాదాపు ఆ ప్రక్రియను ఒక కొలిక్కి తీసుకొచ్చి జిల్లాల పర్యటనకు వెళ్లాలని సీఎం జగన్ యోచిస్తున్నారు. అందులో భాగంగానే ఆయా జిల్లాల్లో నిత్యం ప్రజల్లో ఉండే నేతలకు ఎంపీలుగానూ అవకాశం కల్పించబోతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొంతమందిపై వ్యతిరేకత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారి కుమారులకు అవకాశం కల్పించే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు జిల్లాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో వారి వారసులకు టిక్కెట్లు ఇచ్చేలా కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

# ఇకపై సిఫార్స్ లేఖలపై దర్శనాలకు నో

తిరుపతి, జూన్5: తిరుమలలో జూలై 15వ తేదీ వరకు శుక్ర, శని, ఆది వారాలలో సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలు, సుప్రభాత సేవలను రద్దు చేస్తు న్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపా రు. తిరుమలలోని అన్నమయ్య భవనం లో డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం ఈవో విలేకరులతో మాట్లాడుతూ, ఘాట్‌రోడ్లలో ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేశామని, మహారాష్ట్రలోని నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 600 కోట్ల రూపాయలు విలువచేసే స్థలాన్ని టిటిడికి మహారాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, రూ. 100 కోట్ల వ్యయంతో రేమాండ్స్ అధినేత సింఘానియా ఆలయాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు. అలాగే టీటీడీ పద్మావతి హృదయాలయంలో ఇప్పటి వరకు 1450 మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించామని, అదేవిధంగా వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం విశేషంగా విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు సమన్వయంతో సేవలందిస్తున్నాయని ఇందుకోసం జూలై 15 వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలను ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశామన్నారు.

అలాగే టీటీడీ చరిత్రలో తొలిసారి టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు స్వచ్ఛందంగా నెలరోజుల పాటు సుందర తిరుమల- శుద్ధ తిరుమల కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. అదేవిధంగా తిరుమల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు రాష్ట హోం శాఖ ప్రధాన కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో పోలీసు ఉన్నతాధికారులు తిరుమలలో రెండు రోజుల పాటు భద్రతాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించారని, తద్వారా భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఇక ముఖ్యంగా టీటీడీలో? ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది వ్యక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని, ఇలాంటి వ్యక్తుల మీద ఐటి విభాగం ఇప్పటికే పోలీసులకు పిర్యాదు చేశారని, నిరుద్యోగులు ఇలా ంటి ప్రకటనలు నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

**మేలో శ్రీవారి హుండీ ఆదాయం రూ. 110 కోట్లు**

మే నెలలో 23.38 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా హుండీ ద్వారా రూ.109.99 కోట్లు ఆదాయం వచ్చిందని , విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య 1కోటి 6 లక్షలు, అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య 56.30 లక్షలు, తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య 11 లక్షలుగా నమోదు అయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌వో నరసింహకిషోర్, ఎస్‌విబిసి సి ఈవో షణ్ముఖ్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఖనిలో దళితరత్న కాంపెల్లి సతీష్ పుట్టినరోజు వేడుకలు



గోదావరిఖని, జూన్ 5: ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, దళిత రత్న కాంపెల్లి సతీష్ పుట్టినరోజు వేడుకలు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సభ అధ్యక్షత అంబేద్కర్ సంఘం నాయకులు మైస రాజేష్ వహించారు. 49వ డివిజన్ అంగన్ వాడి కేంద్రం లోని పిల్లలకు జ్యోతి ఫౌండేషన్ ద్వారా సతీశ్ పిల్లలకు ప్యాకెట్ మని అందించి పిల్లల తో కలిసి కేక్ కట్టింగ్ చేసరు. అంగన్వాడీ కేంద్రాలకు ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ కార్పొరేటర్ సనా ఫక్రొద్దీన్, ఖమ్మం నేత నూతి తిరుపతి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవా దక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సూపర్ వైజర్ మల్లేష్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నేత కొంకటి లచ్చన్న, సినీ హీరోల అభిమాన సంఘాల నాయకులు గట్ల రమేష్ చేతులమీదగా ఆంగన్ కేంద్రం వారికి చల్లటి క్యాన్ లను అందించారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జ్యోతి గాంధీ ఫౌండేషన్ దయానంద్ గాంధీ, నాయకులు మంథని లింగయ్య, బూడిద రాజేష్, కేకర్ల సతీష్, సాగరిక తిరుపతి, గద్దల శశిబ్యూషన్, జావీద్ బేగ్, యాకుబ్, సురేష్,శ్యామ్, రాజేష్, రాంబాబు, అంగన్వాడీ టీచర్స్ రామలక్ష్మి, తదితరులు పాలుగొన్నారు.

# భద్రాద్రికొత్తగూడెం దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతామధు



భద్రాద్రికొత్తగూడెం, జూన్ 5 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ ఏర్పడితే తెలంగాణ చిమ్మ చీకటిగా మారి విద్యుత్ కోతలతో కొట్టుమిట్టాడుతుందని అవహేళన చేసిన నాయకులే ఆశ్చర్యపోయే విధంగా నేడు ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలోని తెలంగాణ రాష్ట్రం విద్యుత్ వెలుగులతో వెలిగిపోతుంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ అనుదీప్, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ ప్రగతి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్లతో కలిసి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పాల్గొన్నారు. సాధించుకున్న తెలంగాణలో అనాది కాలంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యావత్ దేశంలోనే ఏ రాష్ట్రం సాధించలేని విధంగా విద్యుత్ ప్రగతి సాధించిన విషయాన్ని వారు మాట్లాడుతూ క్షుణ్ణంగా వివరించారు. విద్యుత్ కోతలు లేని పరిపాలన కేవలం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణలో మాత్రమే కొనసాగుతుందని తెలిపారు. గతంలో తెలంగాణ ప్రాంతంలో విద్యుత్ వస్తే చర్చగా మారేదని, కానీ ప్రస్తుతం పరిస్థితి మారిందని తెలంగాణలో విద్యుత్ పోతే విద్యుత్ పోయిందా? అని చర్చ జరుగుతుందని తెలిపారు. డబల్ ఇంజన్ పేరుతో గొప్పలు మాట్లాడుకునే వారి సొంత రాష్ట్రంలో కూడా విద్యుత్ కోతలతో కొట్టుమిట్టాడుతున్న విషయం యావత్ ప్రపంచానికి తెలుసని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో పవర్ హాలిడే ప్రకటించి మరి పాలన సాగుతుందని, దేశంలో తెలంగాణ మినహా చాలా రాష్ట్రాలలో విద్యుత్ కోతలతో ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని, కనీసం విద్యుత్ సరఫరా లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గృహ వినియోగులకు రెప్పపాటు కరెంటు పోయే ప్రసక్తి కూడా లేదని, ప్రత్యేకించి పరిశ్రమల అభివృద్ధికి, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నిత్యం కెసిఆర్ ప్రత్యేక కార్యరచనలతో పరివేక్షిస్తుంటారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో భాగస్వాములు అయిన ఉద్యోగులందరికీ, కార్మికులకు వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. రాష్ట్రంలో ప్రగతి విద్యుత్ గా ప్రభుత్వం పరిపాలన కొనసాగించేందుకు అహర్నిశలు కృషిచేసిన విద్యుత్ కార్మికులకు, అధికారులకు ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యుత్ ఉన్నతాధికారులు, కార్మికులు, తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ చిన్నారులను చితక్కొట్టిన మహిళా ఆఫీసర్.. కలెక్టర్ సీరియస్

రాయ్‌పూర్, జూన్ 5: అన్నెంప న్నెం ఎరుగని ఇద్దరు చిన్నారులపై ఓ మహిళా ఉద్యోగిని దారుణానికి పాల్పడింది. అనాథ పిల్లలైన ఆ ఇద్దరి జుట్టు పట్టుకొని చితక్కొట్టింది. మంచంపై ఎత్తేసి హింసించింది. ఈ దారుణ ఘటన ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. అనాథలైన 6 సంవత్సరాల లోపు చిన్నారులకు కాంకేర్ జిల్లాలోని అడావ్షన్ సెంటర్‌లో ఆశ్రయం కల్పిస్తున్నారు. అయితే అక్కడ పని చేసే ప్రోగ్రాం మేనేజర్ సీమా ద్వివేది మాత్రం పిల్లల పట్ల క్రూరంగా ప్రవర్తించారు. ఓ ఇద్దరు చిన్నారులను మానసికంగా హింసించింది. ఆ పిల్లల జుట్టు పట్టుకుని చితక్కొట్టింది. అనంతరం వారిని మంచంపై ఎత్తేసింది. ఈ దారుణ దృశ్యాలు అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పిల్లలపై దాడి చేసిన సమయంలో అటుగా వచ్చిన ఇద్దరు ఉద్యోగులు కూడా ద్వివేదిని అడ్డుకోలేదు.

మొత్తానికి ఈ వీడియో బయటకు రావడంతో కాంకేర్ కలెక్టర్ డాక్టర్ ప్రియాంక శుక్లా సీరియస్‌గా స్పందించారు. అడాప్షన్ సెంటర్ ప్రోగ్రాం మేనేజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. గతంలో ఆ సెంటర్ ఉద్యోగులు సీమ ద్వివేది ప్రవర్తన బాగాలేదని, మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

# వేములవాడ పట్టణంలోని గుడి చెరువులోకి మురికి నీరు

## -కాంగ్రెస్ శ్రేణులు నిరసన



రాజన్న సిరిసిల్ల, జూన్5:(నేటి నిజం ప్రతినిధి): చెరువులోనికి మురికి నీరు చేరుతుందని సోమవారం కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. అనంతరంగుడి చెరువు మురికి కాల్వ కలుస్తున్న స్థలాన్ని పరిశీలించారు అనంతరం. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గుడి చెరువు నీరు కలిసి తమ్ము వలన దుర్వాసన వస్తున్నందున ఇక్కడ చేపలు పట్టేవారు గంగ పుత్రులు కలుస్తా నీరుతోని చేపలు చనిపోతున్నాయని అలాగే వచ్చిన యాత్రికులకు దుర్వాసన వస్తుందని స్థానిక ఎమ్మెల్యే వైఫల్యం అని గోదావరి నీళ్లు తీసుకువచ్చి పుష్కర్ణి చేస్తాను ఇక్కడ యాత్రికులు స్నానాలు చేసే విధంగా సౌకర్యం తీర్చిదిద్దుతాను 35 ఎకరాల చెరువు కుదుపేసి అక్కడ ఏం కట్టలేదని దీనికి జవాబు దారిలో స్థానిక ఎమ్మెల్యే చెప్పాలని అన్నారు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకట స్వామి మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ మాటలు తప్ప చేతలు చేయదని 2015 ఇప్పటివరకు మాట్లాడను తప్ప చెరువు మీద చూస్తే 30 ఎకరాలలో రాముని కళ్యాణ మండపం శివుని కళ్యాణ మండపం కళ్యాణకట్ట కళామందిరం ఇక్కడ ఉన్నాయోచూపి యవల సిందిగా టిఆర్ఎస్ పార్టీ నాయకులను స్థానిక ఎమ్మెల్యే ని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ అడుగుతున్నామని లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో కూరగాయల చిలక రమేష్ చంద్రగిరి శ్రీనివాస్ కంచరపు రాజేష్ మెండరాజు వస్తా గణేష్ లహరి కూర దేవయ్య సాబీర్ మామిడాల శ్రీకాంత్ నాగుల విష్ణు కరుణాకర్ ఉన్నారు

# విద్యుత్ వినియోగంలో తెలంగాణ టాప్ : మంత్రి జగదీష్ రెడ్డి




సూర్యాపేట, జూన్ 5: విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం యావత్ భారతదేశంలోనే మొదటి స్థానంలోనే నిలిచిందని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి వెల్లడించారు. జాతీయ తలసరి వినియోగంతో పోల్చి చూసినట్లయితే తెలంగాణ రాష్ట్రంలో 69.40 శాతం విద్యుత్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సృష్టించిన అద్భుతం విద్యుత్ రంగంలో విజయాలు అని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా తెలంగాణ విద్యుత్ విజయోత్సవం సంబురాలను సూర్యాపేట నియోజకవర్గం పరిధిలోని వట్టిఖమ్మం పహాడ్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఈ వేడుకలకు విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

రాష్ట్రం ఏర్పాటుతో చీకట్లు మాయం అయ్యాయని, ఆ ఘనత ముమ్మాటికీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో నిండు సభలో నాటి పాలకులు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడితే చీకట్లో మగ్గుతారంటూ తెలంగాణ సమాజంలో గుబులు పుట్టించిన వారే చీకట్లోకి పోయారని ఆయన ఎద్దేవా చేశారు.

రాష్ట్రం ఏర్పడిన రోజున కేవలం 7,778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే ఉండే. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సంచలనాత్మక నిర్ణయాలతో ఆ ఉత్పత్తి 18,567 మెగావాట్లకు చేరుకుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధికి ఇది నిదర్శనమన్నారు.

ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో పీక్ డిమాండ్ సమయంలో 13,000 మెగావాట్లు ఉండగా ఇప్పుడు ఒక్క తెలంగాణ ప్రాంతంలోనే పీక్ డిమాండ్ సమయంలో నమోదు అయిన 14,700 మెగావాట్లే విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతికి అద్దం పడుతుందని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. యావత్ భారతదేశం నుండి తెలంగాణకు విద్యుత్ ట్రాన్స్‌మిషన్‌కు తగిన వెసులుబాటు ఉందని ఆయన తెలిపారు. 2014కు పూర్వం ఎందుకు 24 గంటల కరెంట్ ఇవ్వలేక పోయారు. అది ఇప్పుడు ఎలా సాధ్యం అయిందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సంక్షోభంతో ఎండిపోయిన పంట పొలాలను చూసి తట్టుకోలేక రైతులు ఆత్మహత్య చేసుకునేవారు. అలాంటి దుర్భర పరిస్థితుల నుండి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేసేదాక చేరుకున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ 9 ఏండ్లలో సాధించిన అభివృద్ధి ఏమిటని విమర్శలు చేసే వారికి విద్యుత్ రంగంలో సాధించిన విజయాలు చెంపపెట్టు లాంటిదని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు.

# ఆర్జీయూకేటీ బాసరలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



ఆదిలాబాద్, జూన్5:నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ పరిపాలన భవన ఆవరణలో డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ తో కలిసి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ మన ఆర్జీయూకేటీ మన బాధ్యత నినాదంతో ఆర్జీయూకేటీ బాసరలో పలు కార్యక్రమాలు చేపట్టామని, నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని తెలిపారు. వాతావరణ మార్పులు ఇప్పుడు మానవ జీవితాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయని, ప్రధానంగా మానవ కార్యక్రమాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. ఇంకా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కరువు సముద్ర మట్టాలు పెరగడం జీవజాతులు సామూహికంగా అంతం కావడం అనే విపత్కర పరిస్థితులను మానవుడు అనుభవించాల్సి వస్తుందన్నారు. 19వ శతాబ్దం కంటే ప్రపంచం ఇప్పుడు ఒకటి పాయింట్ ఒకటి డిగ్రీ సెంటీగ్రేడ్ వేడిగా ఉంది. వాతావరణంలో కార్బన్డయాక్సైడ్ పరిమాణం 50 శాతం పెరిగిందన్నారు. భవిష్యత్తులో గ్లోబల్ వార్మింగ్ నాలుగు డిగ్రీ సెంటీమీటర్లు మించిపోతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే వినాశకరమైన వడగాలిపులతో పాటు లక్షలాది మంది నిరాశ్రయులుగా మారతారని హెచ్చరిస్తున్నారు. అందుచేత సాధారణ ప్రజలు కూడా తమ జీవన విధానంలో చిన్నచిన్న మార్పులు తీసుకురావడం వల్ల వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిమితం చేయవచ్చని వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బయోసైన్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, అధ్యాపకులు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో సి ఎస్ కే ఐ క్రీడాకారులకు రెండు గ్రాండ్ ఛాంపియన్ షిప్స్‌లు

## - క్రీడాకారులను అభినందించిన సి ఎస్ కే ఐ ఛైర్మన్ చల్ల హరి శంకర్





కరీంనగర్, జూన్5: (నేటినిజం ప్రతినిధి): ఈనెల 4 వ తేదీన ఆదివారం కరీంనగర్ లోని కొండ సత్యలక్ష్మి గార్డెన్స్ లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో నగరానికి చెందిన కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా నేషనల్ అకాడెమి సి ఎస్ కే ఐ నుండి 16 మంది క్రీడాకారులు పాల్గొని రెండు గ్రాండ్ ఛాంపియన్ షిప్ ల తో పాటు 28 పతకాలు సాధించారు. అలాగే 14 సంవత్సరాలలోపు విభాగము లో అబ్దుల్ రహమాన్ గ్రాండ్ ఛాంపియన్ షిప్, 12 సంవత్సరాల బాలికల విభాగంలో పి. సన్నిధి గ్రాండ్ ఛాంపియన్ షిప్ సాధించినట్లు సిఇండియా చీఫ్ ఒ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సెన్సయి ఇ. శ్రీనివాస్ తెలిపారు. 28 జిల్లాల నుండి సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పతకాలు మరియు గ్రాండ్ ఛాంపియన్ షిప్ లు సాధించిన క్రీడాకారుల ను సి ఎస్ కే ఐ ఛైర్మన్ బి ఆర్ ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్యదర్శి మాదుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, ఉపాధ్యక్షులు పెద్ది సందీప్ లు అభినందించారు.

# రామారావుకి నివాళులర్పించిన పొంగులేటి శ్రీనన్న సైన్యం

ఖమ్మం, జూన్ 5 (నేటినిజం ప్రతినిధి) :కొనిజర్లమండలం తనికెళ్ల గ్రామానికి చెందిన మేకల రామారావు గుండెనొప్పితో మృతి చెందిన విషయం తెలుసుకొని ఆయన పార్థీవదేహానికి పూలమాలవేసి తమ ప్రగాఢ సానుభూతిని సంతాపం తెలిపి నివాళులర్పించిన పొంగులేటి శ్రీనన్న సైన్యం నాయకులు గడల నరేంద్ర నాయుడు, పెద్దమునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్, ఈ సందర్భంగా నరేంద్ర నాయుడు మాట్లాడుతూ.. రామారావు అతి చిన్న వయస్సులో మృతి చెందడం చాలా బాధకరమని వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుతూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కావూరి శ్రీను, పాపగంటి చిన్నబాబు, కతుకూరి నరసింహ రావు, పదిమల నరేష్, ఉటుకురి రంజిత్, నవీన్, ఎర్ర రామారావు, బండి వెంకటరామారావు, యాస కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



